RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 207 | ఆగస్టు 29 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 207 | August 29 Saturday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

వృత్తినైపుణ్యాలు తప్పకుండా పాటించాలి

2

## స్థానిక ఎన్నికలకు
# జనసేన సన్నద్ధం




**అమరావతి జనసంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సన్నద్ధమవుతోంది. పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, విధివిధానాల రూపకల్పన కోసం అధినేత పవన్ కళ్యాణ్ 14 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయగా, దీనికి సంబంధించి అమరావతిలోని పార్టీ కార్యాలయంలో తొలి సమాయత్త సమావేశం జరిగింది. ఈ భేటీలో పొత్తు ధర్మానికి కట్టుబడుతూనే, పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని నాయకులు నిర్ణయించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ.. కూటమి పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా అడుగులు వేస్తామని చెప్పారు. 25 పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బాధ్యతలను అప్పగించి, యువతకు ప్రాధాన్యం ఇస్తూ నాయకత్వ పటిష్టతకు సెప్టెంబర్ నెలంతా ప్రణాళికలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే జనసేన ప్రాబల్యం పెరిగిందని, సీట్ల శాతం పెంపుతో పాటు నేర చరిత్ర (క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్) లేని అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవడమే లక్ష్యమని స్పష్టం చేశారు.మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. గత సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన స్ఫూర్తితో స్థానిక పోరుకు సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబరు 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 175 నియోజకవర్గాల్లో ర్యాలీలు, సభలతో 'జనసేన

➢ మిగతా 2వ పేజీలో..

## సీఎంకు రాఖీ కట్టిన
# మహిళా మంత్రులు



**హైదరాబాద్ జనసంఘర్షణ**

రక్షా బంధన్ సందర్భంగా హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఒక అపూర్వమైన సన్నివేశం ఆవిష్కృతం అయింది. రాష్ట్ర మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆప్యాయంగా రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు.ఇటీవల పరకాల నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, వివాదాల తర్వాత కొండా సురేఖ ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. అక్కడ సీఎంకి రక్షాబంధన్ కట్టిన అనంతరం, ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రికి మహిళల ఆశీస్సులు, అండ ఎల్లప్పుడూ ఉంటాయని, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించే శక్తిని ఆయనకు అందించాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. రాఖీ పండుగ పవిత్రమైన వాతావరణంలో ఎలాంటి రాజకీయ

➢ మిగతా 2వ పేజీలో..

# కోడిపందాలను చట్టబద్ధం చేయలేం

మద్రాస్ హైకోర్టు



**చెన్నై జనసంఘర్షణ**

కోడిపందాల నిర్వహణపై మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ సంచలన తీర్పు వెలువరించింది. కోడిపందాలను ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టబద్ధం చేయలేమని, జంతు హింస నిరోధక చట్టం–1960 ప్రకారం ఇవి తీవ్రమైన నేరమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ స్పష్టం చేశారు.

➢ మిగతా 2వ పేజీలో..

# బంగారు గనుల్లో టీజీ డిప్యూటీ సీఎం




**రాయ్‌చూర్ జనసంఘర్షణ**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో ఉన్న హట్టి, యూటి బంగారు గనుల్లో విస్తృతంగా పర్యటించి, తవ్వకాల ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు. బంగారం మైనింగ్‌లో సుదీర్ఘ అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ రంగ సంస్థ 'హట్టి గోల్డ్ మైన్స్' తో సింగరేణి జతకట్టి జాయింట్ వెంచర్ ఆధారంగా భవిష్యత్తు ప్రాజెక్టుల్లో కలిసి పనిచేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్యాలను అనుసంధానించడం ద్వారా దేశీయంగా బంగారం ఉత్పత్తిని పెంచి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. హట్టి గోల్డ్ మైన్స్‌కున్న అన్వేషణ, శుద్ధి అనుభవానికి.. సింగరేణికి ఉన్న బొగ్గు, ఇతర ఖనిజ మైనింగ్ సాంకేతిక నైపుణ్యాలను

➢ మిగతా 2వ పేజీలో..

## ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా
# బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

**మంగళగిరి జనసంఘర్షణ**

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు, రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణను ఒక మహోద్యమంగా ముందుకు తీసుకెళ్తానని వెల్లడించారు. మంగళగిరిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో

➢ మిగతా 2వ పేజీలో..

# వైసీపీపై ధ్వజమెత్తిన రామ్మోహన్‌నాయుడు

**అమరావతి జనసంఘర్షణ**

వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఖరిపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప జగన్‌కు మరో ధ్యేయం లేదని మండిపడ్డారు. గత రెండున్నరేళ్లలో ఎన్నో అసెంబ్లీ సమావేశాలు జరిగినా జగన్ సభకు వచ్చి ప్రజా సమస్యలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఆధారం లేని ఆరోపణలు చేస్తూ కేవలం రాజకీయ పబ్బం గడుపుకునేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలోనే రాష్ట్రంలో డీఎస్సీల ద్వారా ఉద్యోగాలు వచ్చాయని, వైసీపీ

➢ మిగతా 2వ పేజీలో..

జన సంఘర్షణ

29 శనివారం, ఆగస్టు 2026

# ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

**మొదటిపేజీ తరువాయి..** 22.96 శాతంగా ఉన్న అటవీ, వృక్ష విస్తీర్ణాన్ని 2047 నాటికి 50 శాతానికి పెంచడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ లక్ష్యం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని, స్వచ్ఛమైన గాలిని అందించాలనే సంకల్పంతో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు సవాలుగా మారుతున్న తరుణంలో, పచ్చదనం పెంపును కేవలం అడవులకే పరిమితం చేయబోమని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ భూములు, గ్రామాలు, పట్టణాలు, రహదారుల ఇరువైపులా, కాలువ గట్లు, బంజరు భూములు, అలాగే ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల ప్రాంగణాల్లో విస్తృతంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి వ్యవసాయ, పంచాయతీరాజ్, అటవీ, విద్యా, రవాణా, జలవనరుల వంటి అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. ఇది కేవలం ప్రభుత్వ పథకంలా కాకుండా రైతులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా ప్రజా ఉద్యమంగా మలుస్తామని నాగబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, నాటిన ప్రతి ఒక్క మొక్కను సంరక్షించి, అవి ఏపుగా పెరిగేలా చూడటమే తమ అసలైన బాధ్యత అని చెప్పారు. మొక్కల మనుగడను పర్యవేక్షించేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# కోడిపందాలను చట్టబద్ధం చేయలేం

**మొదటిపేజీ తరువాయి..** కత్తులు కట్టకుండా పందాలు నిర్వహించినా లేదా గాయాలు కాకుండా చూస్తామని షరతులు పెట్టినా కూడా చట్టపరంగా అనుమతులు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. పక్షులు కూడా జంతు సంక్షేమ చట్టం పరిధిలోకి వస్తాయని, కోడిపందాల నిర్వహణ అనేది పౌరుల ప్రాథమిక హక్కు ఎంతమాత్రమూ కాదని స్పష్టం చేశారు. సినిమాలు లేదా సాంప్రదాయ ఆచారాల్లో కనిపించినంత మాత్రాన కోడిపందాలకు 'సాంస్కృతిక వారసత్వం' లేదా ప్రత్యేక క్రీడ హోదా ఇవ్వలేమని న్యాయస్థానం పేర్కొంది. జల్లికట్టు తరహాలో ప్రభుత్వం ప్రత్యేక చట్టసవరణ తీసుకువస్తే తప్ప ఈ పందాలకు ఎలాంటి మినహాయింపులు లభించవని వెల్లడించింది. గతంలో షరతులతో కూడిన అనుమతులిస్తూ ఇచ్చిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు చట్టవిరుద్ధమని వ్యాఖ్యానిస్తూ, భవిష్యత్తులో ఆ పాత తీర్పులను నిదర్శనంగా తీసుకోకూడదని ఆదేశించింది. తంజావూరు జిల్లా కలెక్టర్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, గతంలో ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

## పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ తెలంగాణ ప్రజలు: ఎంపీ ఈటల రాజేందర్

కేసీఆర్ పాలనను కాదని కాంగ్రెస్‌కు ఓటేసిన తెలంగాణ ప్రజలకు ఇప్పుడు 'పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లు' అయిందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజుతో భేటీ అయిన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా 5 కిలోల సన్న బియ్యం అందిస్తుంటే, రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో వేయకుండా కాంగ్రెస్ నాయకులు తమ బొమ్మలు వేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రధాని మోదీ అన్ని రాష్ట్రాల అభివృద్ధికి సమానంగా నిధులు కేటాయిస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి మద్దతు కోరుతూనే ఇక్కడికి వచ్చి విమర్శలు చేయడం తగదని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల పేరుతో కాంగ్రెస్ నాయకులకు పదవులు ఇచ్చుకుంటున్నారని ఈటల మండిపడ్డారు. కేంద్రం నుంచి ఇళ్ల నిర్మాణానికి మరియు ఇతర సంక్షేమానికి ఎలాంటి వివక్ష లేకుండా నిధులు వస్తున్నాయని చెప్పారు. మెట్రో ఫేజ్-1, 2 లతో పాటు రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం సహకరిస్తోందని, మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు 'అమృత్ భారత్' పథకం కింద రూ.22 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మేడ్చల్, సికింద్రాబాద్ పరిధిలో ఆర్‌వోబీ (=వాదీ), ఆర్‌యూబీ (=ఖదీ)ల నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బందులు కలగకుండా చూడాలని, అర్బన్-రూరల్ హౌసింగ్ పనులను వేగవంతం చేయాలని సీఎస్ సంజయ్ జాజును కోరినట్లు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# వైసీపీపై ధ్వజమెత్తిన రామ్మోహన్‌నాయుడు

**మొదటిపేజీ తరువాయి..** పాలనలో జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని రామ్మోహన్ నాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశారని గుర్తుచేశారు. ఏడాది తర్వాత డీఎస్సీ నిర్వహణపై, మంత్రి నారా లోకేష్‌పై జగన్ బురదజల్లే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ప్రజలు 151 సీట్లు ఇచ్చి గెలిపిస్తే ఐదేళ్ల పాటు రాష్ట్రంలో విధ్వంసకర పాలన అందించారని, అందుకే ప్రజలు ఆయనను ఓడించారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసాన్ని ప్రారంభించిన జగన్, ఇప్పటికీ అదే వైఖరితో ఉన్నారని ఎద్దేవా చేశారు. కూటమి డబుల్ ఇంజన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తుంటే, దానిని జీర్ణించుకోలేక యువతకు ఉద్యోగాలు రాకూడదనే కుట్రతోనే జగన్ విమర్శలు చేస్తున్నారని రామ్మోహన్ నాయుడు ఆరోపించారు.

# స్థానిక ఎన్నికలకు జనసేన సన్నద్ధం

**మొదటిపేజీ తరువాయి..** యువజన 'సేన' అపూర్వ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా, 2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ బెదిరింపులు, దాడులను తట్టుకుని ధైర్యంగా నిలబడి పోటీ చేసిన 1,000 మంది జనసేన అభ్యర్థులకు ఈ సమావేశంలో ప్రత్యేక గుర్తింపు లభించింది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మంత్రి నాదెండ్ల మనోహర్ వారందరినీ శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి పోరాట స్ఫూర్తిని కొనియాడారు.

# ఏలూరులో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రతిభ, ఘనంగా 'వృక్షా బంధన్' వేడుకలు

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 పురోగతిలో ఏలూరు జిల్లా ఆంధ్రప్రదేశ్‌లోనే రెండవ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఓటర్ల జాబితా పరిశీలకులు లోతేటి శివశంకర్ ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి నిర్వహించిన ఈ భేటీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆర్వోలు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్వోల పనితీరు, పోలింగ్ స్టేషన్ల స్థితిగతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులకు చోటు కల్పిస్తూ, అనర్హులను తొలగించి దోషరహిత ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యమని చెప్పారు. ఈ నెల 30 వరకు అభ్యంతరాలకు గడువు ఉందన్న ఆయన, అక్టోబరు 3న తుది జాబితా ప్రచురణకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 18 ఏళ్లు నిండిన వారు ఫారం-06 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

మరోవైపు, ఏలూరు జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో "చెట్టుకి రాఖీ... ప్రకృతికి రక్షణ" అనే నినాదంతో 'వృక్షా బంధన్' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా అటవీ శాఖాధికారి పి.వి. సందీప్ రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, పోలవరం తదితర రేంజ్‌లలో ఈ పర్యావరణ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. రామసింగవరం అటవీ ప్రాంతంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి 200 మొక్కలు నాటడంతో పాటు, వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేస్తూ చెట్లకు రాఖీలు కట్టారు.

# బంగారు గనుల్లో టీజీ డిప్యూటీ సీఎం

**మొదటిపేజీ తరువాయి..** జోడించేలా సంయుక్త కార్యాచరణ రూపొందించాలని సింగరేణి సీఎండీ, అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా భట్టి విక్రమార్క గనుల నుంచి వెలికితీసిన ఖనిజాన్ని శుద్ధ బంగారంగా మార్చే ప్రొడక్షన్, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను సందర్శించగా, రోజుకు 2 నుండి 4 కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత యూటీ ఓపెన్ కాస్ట్ మైన్, భూగర్భ గనులను సందర్శించి ముడి మట్టి సేకరణ, కార్మికుల భద్రత, ఆధునిక యంత్రాల వినియోగం మరియు మ్యాప్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి మరియు హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీఎంకు రాఖీ కట్టిన మహిళా మంత్రులు

**మొదటిపేజీ తరువాయి..** వ్యాఖ్యలు చేయబోనని ఆమె స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా పరకాలలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించి, వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్ రెడ్డి అభ్యర్థి అని సూచనలు ఇవ్వడం, దానికి పోటీగా కొండా సురేఖ కుమార్తె సుస్మిత తీవ్రస్థాయిలో విమర్శలు చేసి రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ కొండా సురేఖకు నోటీసులు జారీ చేయగా, కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తాను బాధ్యురాలిని కానని ఆమె వివరణ ఇచ్చారు. ఈ వివాదం తదుపరి చర్యల దశలో ఉన్న నేపథ్యంలో, సురేఖ నేరుగా సీఎం నివాసానికి వచ్చి రాఖీ కట్టడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఇదే సందర్భంగా బ్రహ్మకుమారీలు, మహిళా కానిస్టేబులు మరియు హోంగార్డులు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టి తమ సోదరభావాన్ని చాటుకోగా, సీఎం వారిపట్ల ఆప్యాయతను ప్రకటిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## వృత్తినైపుణ్యాలు తప్పకుండా పాటించాలి

తెలంగాణ పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు (ప్రొఫెషనల్ స్టాండర్డ్స్) తప్పనిసరిగా పాటించాలని, నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో అన్ని యూనిట్ల ఉన్నతాధికారులతో నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేరాల సమీక్షను కేవలం అంకెల గణాంకాలకే పరిమితం చేయకూడదని, ప్రతి నేరం వెనుక ఉన్న మూల కారణాలు, నేరస్థులు అనుసరించే పద్ధతులు (మోడస్ ఆపరేండి) మరియు దర్యాప్తు లోతుపాతులను సమగ్రంగా విశ్లేషించాలని స్పష్టం చేశారు.

క్షేత్రస్థాయిలో ప్రాథమిక పోలీసింగ్ విధానాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించిన డీజీపీ, సీసీటీఎన్ఎస్ (జజుచీ) డేటా అప్‌డేషన్ గతంలో 70-80 శాతం ఉండేదని, సిబ్బంది సమష్టి కృషితో అది ప్రస్తుతం 96 శాతానికి చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇకపై మల్టీజోన్ ఐజీలు, డీఐజీలు తమ ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, తనిఖీల సమయంలో వెలుగుచూసిన లోపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో గత మూడేళ్ల కాలంలో నమోదైన నేర గణాంకాలను డీజీపీ వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం నేరాలు 7.15 శాతం పెరిగి 2,65,377 కేసుల నుండి 2,84,363కు చేరగా, మాదకద్రవ్యాల కేసులు 46.10 శాతం పెరిగి 2,960కి ఎగబాకాయి. అలాగే వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కి పెరిగి 1,704 శాతం భారీ వృద్ధిని, ట్రాఫిక్ నేరాలు 9.48 శాతం పెరిగి 31,891 నమోదు చేశాయి. అదే సమయంలో సాంకేతిక ఆధారిత ముందస్తు చర్యల వల్ల సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం మరియు తీవ్ర నేరాలు (+తీుజవ జతీఱఎవం) 10.33 శాతం మేర తగ్గడం విశేషం. ఈ అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయేల్, ఉమెన్ సేఫ్టీ విభాగం డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా సహా పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు, సీపీలు మరియు జిల్లా ఎస్పీలు పాల్గొన్నారు.

# విద్యుత్‌ను ప్రజల హక్కుగా కాపాడుకోవడమే బషీరాబాగ్ అమరవీరులకు మనం ఇచ్చే ఘనమైన నివాళి

- విద్యుత్ సంస్కరణల ముప్పును అడ్డుకోవాలి.

మంచిర్యాల జిల్లా, చెన్నూరు మండలం, ఆగష్టు 28(జనసంఘర్షణ):

చెన్నూర్ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాటి విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరం ఆగస్టు 28 బషీరాబాద్ విద్యుత్ పోరాటంలో అమరులైన, బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి లకు జోహార్లు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బోడెంకి చందు సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. విద్యుత్తు లేకుండా ఆధునిక జీవితం ఒక్క అడుగు కూడా ముందుకు సాగదు. నీటి నుంచి వ్యవసాయం వరకు, విద్య నుంచి వైద్యం వరకు, దేశ ఆర్థిక వ్యవస్థ నుంచి సామాన్యుని జీవితం వరకు ప్రతి రంగానికి విద్యుత్ ఆధారం. అలాంటి విద్యుత్తు ప్రజల హక్కా కార్పొరేట్ల సొత్తా అనే ప్రశ్న మరోసారి దేశం ముందుకు వచ్చింది. ఎందుకంటే 26 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా బషీరాబాగ్ లో ప్రజలు సాధించిన విజయం ప్రైవేటీకరణ తిప్పికొట్టింది. ఆ పోరాటంలో అమరులైన బాలస్వామి, రామకృష్ణ విష్ణువర్ధన్ స్ఫూర్తితో ఉద్యమించాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన విద్యుత్ చట్టాన్ని 2021 లో తీసుకొచ్చిన విద్యుత్ చట్టంపై రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, కార్మిక ఉద్యమం కూడా వ్యతిరేకించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదన తాత్కాలికంగా నిలిపివేసింది.



అయితే బడా కార్పొరేట్ ఒత్తిళ్లతో మోడీ ప్రభుత్వం తాజాగా విద్యుత్ సవరణ చట్టాన్ని తీసుకొస్తుంది. బిజెపి పాలిత ప్రాంతాల్లో ప్రతిఘటనలు మొదలయ్యాయి. మన దేశ భవిష్యత్తు కాపాడుకోవడం కోసం విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో తెలంగాణలో విద్యుత్ సంస్కరణలు అమలు కాకుండా విశాల ఐక్య ఉద్యమాలకు సిద్ధం అవ్వాలి. ముంచుకొస్తున్న విద్యుత్ సంస్కరణలను ఉద్యోగులు,రైతులు, కూలీలు, యువత అడ్డుకొని విద్యుత్తు ప్రజాసేవగా, ప్రజల హక్కుగా కాపాడుకోవడమే బషీరాబాగ్ అమరవీరులకు మనం అందించే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమాచారి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంజీవ్, అరిగల మహేష్ పాల్గొన్నారు.

# నకిలీ ఎరువులు, పురుగు మందుల డీలర్స్ పైన చర్యలు తీసుకోవాలి

- ప్రజాపంథా మండల కార్యదర్శి పాలేం నాగరాజు డిమాండ్.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 28(జనసంఘర్షణ ):

చర్ల మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సాయన్న మాట్లాడుతూ.. ఈ వ్యవసాయ సీజన్లో కేంద్రం ప్రవేశపెట్టిన ఎరువులు ఆన్లైన్ బుకింగ్ రద్దు చేయాలని, లైసెన్స్ లేని ఫెర్టిలైజర్ షాపులను రద్దు చేయాలి, రైతులను మోసం చేస్తూ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కల్తీ చేస్తున్న ఫెర్టిలైజర్ షాప్స్ పై అగ్రికల్చర్ ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలి. అదేవిధంగా జిల్లాలో డివిజన్లో, మండలాల్లో రైతుల్ని మోసం చేస్తూ బారు వడ్డీ వేస్తున్న ఫెర్టిలైజర్ షాపులో యజమానులపై చర్య తీసుకోవాలి, రైతులకు పూర్తి సబ్సిడీకి ఎరువులు, విత్తనాలు, వడ్డీ లేని రుణాలు ప్రభుత్వమే ఇవ్వాలి




అదేవిధంగా చర్ల మండలంలో జరుగుతున్న మూగజీవుల దొంగ వ్యాపారాన్ని అధికారులు అరికట్టాలి అరికట్టన యెడల ఉన్నతాధికారులు వారిపై చర్య తీసుకోవాలి ఈ కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి పాలెం నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు చింతకాయల సరళ, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు పాలెం , ఐక్య రైతు సంఘం నాయకులు కల్లూరి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 29న నందగోకుల్ నుంచి చల్మెడ కమాన్ వరకు మహా పాదయాత్ర

- పాదయాత్రను విజయవంతం చేయాలి.
- మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా నిజాంపేట చల్మెడ కమాన్-నందగోకుల్ రహదారి, బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రేపు అనగా తేదీ 29-08-2026 శనివారం ఉదయం 9:00 గంటలకు నంద గోకుల్ నుండి చల్మెడ కమాన్ వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పాదయాత్రలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల.శశిధర్ రెడ్డి, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొంటారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులు నిధుల విడుదల నిలిచిపోవడంతో మధ్యలోనే ఆగిపోయాయని,



దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాదయాత్రలో ప్రజలు, సర్పంచ్, నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన కంఠరెడ్డి తిరుపతిరెడ్డి

- రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన కుటుంబ సభ్యులు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28(జనసంఘర్షణ)

మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన మెట్టుంవిజయలక్ష్మి-సిద్ధిరాములు దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి నూతన గృహప్రవేశం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న తిరుపతిరెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు.





# చేతికి రాఖీ హృదయానికి ఆత్మీయత

ఉమ్మడి మీద జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (జన సంఘర్షణ)

రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నా చెల్లెళ్ల ఆత్మీయత, అనురాగం, ఆప్యాయతలకు ప్రతీకగా రాఖీ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మెదక్ మండలం మంబోజి పల్లి గ్రామ శివారులోని శ్రీ మల్లన్న స్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపక పూజారి మల్లన్న స్వామి స్వామివారికి రాఖీ కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో హోమం నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు శ్రీ మల్లన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు.



# చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ

- రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్లూకోల్ట్ పోలీసులకు రాఖీ కట్టిన సోదరి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (జన సంఘర్షణ)







రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్లూకోల్ట్ పోలీసులు విధుల్లో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తుండగా ఓ సోదరి పోలీసులకు రాఖీ కట్టి అభిమానం చాటుకున్నారు. సమాజంలో పోలీసుల పాత్ర పెద్దన్న వంటిదని ఆమె పేర్కొన్నారు.మహిళలు వివిధ రంగాల్లో పనిచేస్తూ ఎప్పుడంటే అప్పుడు ఇంటి నుంచి బయటకు వచ్చి కళాశాలలు, ఉద్యోగాలు, ఇతర పనులకు వెళ్తున్నారని, వారు ధైర్యంగా బయటకు వెళ్లగలుగుతున్నారంటే పోలీసుల భద్రతపై ఉన్న నమ్మకమే కారణమని అన్నారు. చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ అంటూ పోలీసులకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పండగ రోజు కూడా కుటుంబాలకు దూరంగా విధుల్లో ఉంటూ ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తున్న బ్లూకోల్ట్ సిబ్బంది సేవలను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా సిబ్బంది కూడా సోదరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రతే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు రాఖీ కట్టడం ద్వారా పోలీసులపై ప్రజలకు ఉన్న విశ్వాసం, ఆత్మీయ అనుబంధం మరోసారి చాటిచెప్పినట్లయింది.

# ప్రగతి ధర్మారంలో ఇంటింటా తిరిగి నూతన పెన్షన్ దారుల దరఖాస్తులను పరిశీలన

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (జన సంఘర్షణ)





మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామంలో డైరెక్టర్ పెన్షన్స్ గోపాల్ రావు డి ఆర్ డి ఓ సర్ ఎంపీడీఓ రామాయంపేట, నిజాంపేట్ ఎంపీడీఓ, చేగుంట, అగ్రికల్చర్ ఆఫీసర్, ఎంపీడీఓ, ఎంపీవో, డీపీఎం ఎస్ ఎస్, పంచాయతీ సెక్రటరీ, గ్రామ సర్పంచ్, వార్డ్ సభ్యులు హాజరు కావడం జరిగింది. పెన్షన్ దరఖాస్తు చేసుకున్న సభ్యుల ఇంటికి వెళ్లి వెరిఫికేషన్ చేయడం జరిగింది. రామాయంపేట మండలం, ప్రగతి ధర్మారం గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కొత్త పెన్షన్ల ధృవీకరణ ప్రక్రియను పరిశీలించేందుకు సందర్శించారు.

# అన్నాచెల్లెళ్ల ఆత్మీయ బంధానికి రక్షాబంధన్ సాక్ష్యం

- మహిళల గౌరవం, భద్రతే సమాజ ప్రగతికి పునాది.
- నీలం మధు.
- నీలం మధుకు రాఖీలు కట్టి అభిమానాన్ని చాటిన మహిళలు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (జన సంఘర్షణ)



అన్నాచెల్లెళ్ల ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు రక్షాబంధన్ పండుగ సాక్ష్యంగా నిలుస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం రాఖీ పండుగ ఉత్సవాలను పురస్కరించుకుని నీలం మధుకు పలువురు మహిళలు ఆయన నివాసంలో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేయగా, నీలం మధు వారికి మిఠాయిలు అందిస్తూ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. రక్షాబంధన్ భారతీయ సంస్కృతిలో ఎంతో పవిత్రమైన పండుగ అని, ఇది కేవలం ఒక దారాన్ని కట్టే సంప్రదాయం కాదని, పరస్పర విశ్వాసం, ఆత్మీయత, రక్షణకు ఇచ్చే మాటకు ప్రతీక అని అన్నారు. సమాజంలో ప్రతి మహిళ గౌరవంగా, భద్రంగా జీవించే వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతి, సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, మహిళల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సోదరభావం, సామాజిక ఐక్యతను పెంపొందించే ఇలాంటి పండుగలు సమాజాన్ని మరింత దగ్గర చేస్తాయని అన్నారు.

# సేవా కార్యక్రమాలతో కోనేరు శశాంక్ జన్మదిన వేడుకలు

- పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహణ..
- విద్యార్థినుల భద్రతకు సీసీ కెమెరాల హామీ

రుద్రూర్, ఆగస్టు 28 (జనసంఘర్షణ): బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కోనేరు శశాంక్ జన్మదిన వేడుకలను కార్యకర్తలు, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. రుద్రూర్ మండలం దేవునిగుట్ట తండా, నస్రుల్లాబాద్‌తో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కోనేరు శశాంక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కోటగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కోనేరు శశాంక్ విద్యార్థినులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అదేవిధంగా రాఖీ కట్టిన మహిళలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి





చెక్కుల రూపంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పోతంగల్, కోటగిరి ప్రెస్‌క్లబ్ సభ్యులు కోనేరు శశాంక్‌ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రముఖులు, నాయకులు సైతం ఆయనను సన్మానించారు. అనంతరం దేవునిగుట్ట తండా, నస్రుల్లాబాద్‌లో కార్యకర్తలు, ట్రస్ట్ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబం సర్పంచ్ కుర్లెపు గంగాధర్, ఉపసర్పంచ్ రేపల్లె సాయిప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సున్నం సాయిలు, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి సాయిరెడ్డి, చందూర్ మాజీ ఎంపీటీసీ నర్సింహులు, బాన్సువాడ రూరల్ అధ్యక్షుడు శ్రీను, కోటగిరి మండల బీజేపీ అధ్యక్షుడు ఏముల నవీన్, రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షుడు హరికృష్ణ, సీనియర్ నాయకులు పుల్లెల మోహన్‌రావు, మహిళా మోర్చా నాయకురాలు శ్యామల కులకర్ణి, మామిడి శ్రీనివాస్, మామిడి రవి, మామిడి సాయిలు, ఓమన్న పటేల్, ప్రకాష్ పటేల్, దావులయ్య, నాగేల్లి శ్రీనివాస్, వడ్ల శ్యామ్, పబ్బా శేఖర్, విలాస్, జగదీష్, శ్యామ్, శివశంకర్, సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా రాఖీ బంధం..

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు రాఖీ కట్టిన మహిళా నాయకులు...





రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు సతీమణి భవాని, మహిళా సర్పంచులు భూక్య అనిత బాలు, భూక్యా సునీత రామ్లా నాయక్ తో పాటు వైరా మండల బీజేపీ మహిళా నాయకులు గౌరవ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్‌కి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ..రాఖీ పౌర్ణమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన బంధమని అన్నారు. రాజకీయాల్లో ఎన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా మనమంతా ఒక కుటుంబంలా, సోదరభావంతో మెలగడం మన సంస్కృతిలోని గొప్పతనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాఖీ బంధం రాజకీయాలకు అతీతమైన ఆత్మీయతను చాటుతుందని, మహిళలు తనపై చూపిన ప్రేమాభిమానాలు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని తెలిపారు. వైరా నియోజకవర్గంలోని ప్రతి అక్కాచెల్లెమ్మకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాఖీ కట్టిన మహిళా నాయకులకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, వైరా నియోజకవర్గ ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

- మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్..
- రూ.91 వేల నకిలీ నోట్లు, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం

పిట్లం/, ఆగస్టు 28/ (జనసంఘర్షణ): నకిలీ కరెన్సీని కొనుగోలు చేసి చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును కామారెడ్డి జిల్లా పోలీసులు ఛేదించారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.91 వేల విలువైన నకిలీ కరెన్సీ, మూడు సెల్‌ఫోన్లు, నేరానికి ఉపయోగించిన షిఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి తెలిపారు.

**పెట్రోల్ బంకులో నకిలీ నోట్లతో చెల్లింపు**

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 26న ఉదయం బాన్సువాడలోని హెచ్‌పీ పెట్రోల్ పంపులో నలుగురు వ్యక్తులు ఎం.హెచ్-38-వి-2837 నంబర్ గల కారులో వచ్చి రూ.2 వేల విలువైన పెట్రోల్ పోయించుకున్నారు. అనంతరం రూ.500 చొప్పున నాలుగు నోట్లు ఇవ్వగా, అవి నకిలీవని క్యాషియర్ శ్రీకాంత్‌రెడ్డి గుర్తించారు. వారిని ఆపేందుకు ప్రయత్నించగా కారును ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై క్యాషియర్ ఫిర్యాదు మేరకు పిట్లం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

**రూ.లక్షకు రూ.2 లక్షల నకిలీ కరెన్సీ**

కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్‌చంద్ర ఆదేశాల మేరకు, బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి పర్యవేక్షణలో బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, పిట్లం ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేయగా మహారాష్ట్రలోని పర్భణీ జిల్లాకు చెందిన రాహుల్ రావుసాహెబ్ అవాడ్ (23), అతని స్నేహితులు ప్రతీక్, భీమ్‌శంకర్ నకిలీ



కరెన్సీ వ్యవహారంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ముదస్సర్ హుస్సేన్ అలియాస్ షాబాబా వద్ద నకిలీ కరెన్సీ లభిస్తుందని తెలుసుకున్న నిందితులు.. రూ.లక్ష అసలు కరెన్సీ ఇస్తే రూ.2 లక్షల నకిలీ కరెన్సీ ఇస్తామనే ప్రలోభానికి గురైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. డబ్బు సమకూర్చుకుని హైదరాబాద్‌కు వెళ్లి నకిలీ కరెన్సీ తీసుకుని మహారాష్ట్రకు తిరుగు ప్రయాణంలో పిట్లం హైవే సమీపంలోని పెట్రోల్ బంకులో నాలుగు నకిలీ రూ.500 నోట్లను చలామణి చేసినట్లు పోలీసులు తెలిపారు.

**టోల్ ప్లాజా వద్ద పట్టివేత**

నకిలీ కరెన్సీని మరింత చలామణి చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో ధర్మారం టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.500 విలువైన 182 నకిలీ నోట్లు, మొత్తం రూ.91,000, మూడు మొబైల్ ఫోన్లు, ఎం.హెచ్-38-వి-2837 నంబర్ గల షిఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. కేసులో నకిలీ కరెన్సీని సరఫరా చేసిన వ్యక్తులతో పాటు ఇతరుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. నకిలీ కరెన్సీ సరఫరా నెట్‌వర్క్, ఇతర రాష్ట్రాల్లో ఉన్న సంబంధాలపై కూడా విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

**అధికారుల హెచ్చరిక....**

తక్కువ మొత్తంలో అసలు డబ్బులు ఇస్తే రెట్టింపు నకిలీ కరెన్సీ ఇస్తామంటూ సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల్లో ప్రలోభపెట్టే వ్యక్తులను ప్రజలు నమ్మవద్దని పోలీసులు హెచ్చరించారు. నకిలీ కరెన్సీని కొనుగోలు చేయడం, కలిగి ఉండడం, చలామణి చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి వ్యవహారాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

**పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు**

నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పిట్లం ఎస్ఐ ఆంజనేయులు, బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్యతో పాటు పోలీసు సిబ్బంది శైలేష్, రాము, వెంకటేష్‌లను జిల్లా ఎస్పీ ఎం. రాజేష్‌చంద్ర అభినందించినట్లు డీఎస్పీ విఠల్‌రెడ్డి తెలిపారు.

# ఖాకీ చేతికి.. ఆత్మీయ రాఖీ

- చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 (జన సంఘర్షణ) మెదక్: రాఖీ పౌర్ణమి వేళ విధుల్లో ఉన్న బ్లూకోల్ట్ పోలీసులను సోదరులుగా భావించి ఓ మహిళ రాఖీ కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. పండగ రోజు కూడా కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.మన ఇంటికి అన్నయ్య అండగా ఉంటే.. సమాజానికి పోలీసులు అండగా ఉంటారు. మహిళలు ధైర్యంగా బయటకు వెళ్లగలుగుతున్నారంటే పోలీసుల భద్రతపై ఉన్న నమ్మకం కూడా కారణమే” అని ఆమె పేర్కొన్నారు. రాఖీ కట్టించుకున్న బ్లూకోల్ట్ సిబ్బంది సైతం సోదరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.





# రాఖీ పండుగ వేళ ఆత్మీయతను పంచుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారిని మంత్రి సీతక్క గారు, కాంగ్రెస్ మహిళా నాయకులు, బ్రహ్మకుమారీస్ సోదరీమణులు కలిసి రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరీమణుల ఆత్మీయతను స్వీకరించి, వారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం సోదరీమణులందరికీ స్వీట్లను పంచి, కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సోదర, సోదరీమణుల బంధాలు కేవలం పుట్టుకతోనే ఏర్పడవని, కాలక్రమంలో మన ప్రయాణంలో ఎన్నో ఆత్మీయ బంధాలు ఏర్పడతాయని వాటిని మరింత బలపరచడానికి రాఖీ పండుగ వేదికవుద్దన్నారు. రాఖీ పండుగ సందర్భంగా సోదరీమణులంతా తన వద్దకు వచ్చి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని మంత్రి ఆకాంక్షించారు.

## చిన్నారి ప్రాణం కోసం ఆర్థిక సాయం కోరుతున్న కుటుంబం

- గుండె సంబంధిత సమస్యతో 1.5 ఏళ్ల మహాన్వి కిరణ్..
- చికిత్సకు రూ.10--15 లక్షల ఖర్చు

పోతంగల్, /ఆగస్టు 28/ (జనసంఘర్షణ): ఒకటిన్నరేళ్ల చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ఆ కుటుంబం దాతల సహాయం కోసం ఎదురుచూస్తోంది. నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన శ్రీహిత-కళ్యాణ్ దంపతుల కుమార్తె మహాన్వి కిరణ్ (1.5 సంవత్సరాలు) పుట్టుకతోనే గుండెలో రంధ్రం (కంజెనిటల్ హార్ట్ డిఫెక్ట్) అనే గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. ప్రస్తుతం చిన్నారి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చీఫ్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



**రెండు శస్త్రచికిత్సలు అవసరం....**

చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు రెండు పెద్ద ఓపెన్ హార్ట్ సర్జరీలు చేయాల్సి ఉంటుందని సూచించినట్లు తెలిపారు. ప్రస్తుతం మొదటి శస్త్రచికిత్స అత్యవసరంగా చేయాల్సి ఉండగా, రెండో శస్త్రచికిత్సను చిన్నారికి సుమారు ఏడేళ్ల వయస్సు వచ్చిన తర్వాత చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మొదటి శస్త్రచికిత్సకే సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు అంచనా వేసినట్లు తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో ఇంతటి భారీ వైద్య ఖర్చును భరించడం తమకు సాధ్యం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దాతల సహాయం కోసం వేడుకోలు**

చిన్నారి మహాన్వి కిరణ్ ప్రాణాలను కాపాడేందుకు దాతలు, సేవా సంస్థలు, ప్రజలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. మీరు అందించే చిన్న సహాయం కూడా చిన్నారి ప్రాణాలను నిలబెట్టేందుకు ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఒక చిన్న ప్రాణం మీ ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. మానవత్వంతో స్పందించి మహాన్వి కిరణ్ చికిత్సకు సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, జేసీబీ సీజ్

- రాయకూర్ శివారులో అక్రమ మొరం తవ్వకాలపై రెవెన్యూ అధికారుల కొరడా..
- అనుమతులు లేకుండా రవాణా చేస్తే కఠిన చర్యలులి

రుద్రూర్,/ ఆగస్టు 28 /(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా): రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు, రవాణా చేస్తున్న వారిపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్ట ప్రాంతంలో మొరం తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం అందడంతో అధికారులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా మొరం తవ్వకాలు చేస్తున్న ఒక జేసీబీతో పాటు మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లను సీజ్ చేసినట్లు రుద్రూర్ తహసీల్దార్ తారాబాయి తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, నిబంధనల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు.

**అక్రమ రవాణాపై కఠిన చర్యలు.**

ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం, ఇసుక తవ్వకాలు చేపట్టడం, రవాణా చేయడం చట్టవిరుద్ధమని తహసీల్దార్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమంగా తవ్వకాలు, రవాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా గుట్టలు, ప్రభుత్వ భూములు, ఇతర ప్రాంతాల్లో మొరం తవ్వకాలు చేపట్టవద్దని అధికారులు సూచించారు. అక్రమంగా ఇసుక, మొరం రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ...తహసీల్దార్ సురేందర్ నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధమే ప్రేమకు ప్రతీక..

- రక్షణకు నిదర్శనం
- పూర్ణిమ పర్వదినం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన ప్రజా గొంతు కొప్పుల గంగాధర్

పోతంగల్/ఆగస్టు 28/జన సంఘర్షణ)




అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే పవిత్రమైనలి పూర్ణిమ పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, తన కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు కొప్పుల గంగాధర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అన్నయ్య--చెల్లెలి బంధం కేవలం రక్త సంబంధమే కాదని.. జీవితాంతం ఒకరికొకరు అండగా నిలిచే ఆప్యాయత, నమ్మకం, రక్షణకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ప్రేమానురాగాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

**ప్రశ్నించే గొంతుగా.. ప్రజల పక్షాన గంగన్న..!!!**

నీతికి, నిజానికి నిర్భయంగా నిలబడి.. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించే గొంతుగా కొప్పుల గంగాధర్ నిలుస్తున్నారని పలువురు పేర్కొన్నారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, బాధితుల తరపున ప్రశ్నిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్న గంగన్నను పలువురు ప్రజా గొంతు, ప్రజా నాయకుడుగా అభివర్ణించారు. అధికారం, ఒత్తిళ్లకు వెరవకుండా వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడం, అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించడం, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించడం ఆయన ప్రత్యేకతగా పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ పూర్ణిమ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ప్రతి ఇంటా ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ప్రశాంతత వెల్లివిరియాలని కొప్పుల గంగాధర్ ఆకాంక్షించారు.

# రాఖీ కట్టిన అక్క.. ఆత్మీయ ఆశీర్వాదం

- పోచారం శ్రీనివాసరెడ్డికి రాఖీ కట్టిన అక్క దొడ్ల సత్యవతి?



బాన్సువాడ, ఆగస్టు 28 (జనసంఘర్షణ):

రాఖీ పౌర్ణమి సందర్భంగా బాన్సువాడలోని తన నివాసంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి ఆయన అక్క దొడ్ల సత్యవతి రాఖీ కట్టి ఆత్మీయంగా ఆశీర్వదించారు. అన్నా--చెల్లెలు, అక్కా--తమ్ముళ్ల మధ్య ఉండే ప్రేమానురాగాలను ప్రతిబింబించేలా ఈ రాఖీ వేడుక ఆత్మీయంగా సాగింది.

**అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్**

రాఖీ పౌర్ణమి అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి, అక్కా-తమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు ప్రతీకగా రక్షాబంధన్ పండుగ నిలుస్తుందని అన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధం, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని కోరుకుంటూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అక్క చేత రాఖీ కట్టించుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి.. కుటుంబ బంధాల విలువను చాటుతూ ఆత్మీయంగా పండుగను జరుపుకున్నారు.

# గనుల శాఖ అధికారిపై ఏసీబీ కేసు.. భారీగా ఆస్తుల గుర్తింపు

- భూపాలపల్లి గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజుపై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలు.. 8 ప్రాంతాల్లో సోదాలు

తెలంగాణ, ఆగస్టు 28 (జన సంఘర్షణ):

భూపాలపల్లి జిల్లా గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. అవినీతి, అనుమానాస్పద మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో జయరాజుతో పాటు ఆయన బంధువులు, సహచరులకు సంబంధించిన 8 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఇప్పటివరకు రూ.3,06,53,177 విలువైన ఆస్తులు గుర్తించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. వీటిలో స్థిర, చరాస్తులతో పాటు నగదు, బ్యాంకు నిల్వలు, బంగారు ఆభరణాలు, వాహనాలు ఉన్నట్లు తెలిపారు. భారీగా ఆస్తులు గుర్తింపు. ఏసీబీ సోదాల్లో గుర్తించిన ఆస్తుల్లో.. బోడుప్పల్‌లో సుమారు రూ.40 లక్షల విలువైన జీ+2 భవనం. కేపీహెచ్‌బీ కాలనీలో రూ.32.81 లక్షల విలువైన ఫ్లాట్. కీసర, తుంగతుర్తి, తూప్రాన్, సూర్యాపేట ప్రాంతాల్లో 5 ప్లాట్లు..3.21 ఎకరాల వ్యవసాయ భూమి. సోదాల్లో రూ.10.03 లక్షల నగదు. ఎల్ఐసీ, మ్యాక్స్ లైఫ్ ఖాతాల్లో రూ.19.86 లక్షల పొదుపులు. మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు.. మొత్తం విలువ సుమారు రూ.40 లక్షలు. పోస్టాఫీస్ ఖాతాలో రూ.20.86 లక్షలు. 629 గ్రాముల బంగారు ఆభరణాలు.. విలువ సుమారు రూ.37.23 లక్షలు. గృహోపకరణాల విలువ రూ.10.67 లక్షలు. మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71.27 లక్షల నిల్వలు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. డ్రైవర్ ఖాతా నుంచి కుమార్తె ఖాతాకు నగదు బదిలీ అధికారి డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి ఆయన కుమార్తె ఖాతాకు రూ.24.80 లక్షలు బదిలీ అయినట్లు ఏసీబీ దర్యాప్తులో గుర్తించింది. ఇసుక రవాణా, సంబంధిత కార్యకలాపాల్లో ఉన్న వ్యక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి బదిలీ చేసినట్లు డ్రైవర్ వాంగ్మూలం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ రూ.24.80 లక్షల లావాదేవీల మూలం, స్వభావం, ఉద్దేశ్యంపై ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని ఆస్తులపై విచారణ గుర్తించిన ఆస్తుల మొత్తం విలువ రూ.3,06,53,177గా అధికారులు పేర్కొన్నారు. ఇంకా




ఏమైనా అదనపు ఆస్తులు ఉన్నాయా అనే అంశంపై ఏసీబీ అధికారులు తదుపరి ధృవీకరణ కొనసాగిస్తున్నారు. స్థిరాస్తుల మార్కెట్ విలువ పత్రాల్లో పేర్కొన్న విలువ కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జయరాజుపై అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


**అధికారుల హెచ్చరిక...**

ప్రభుత్వ పదవులను అడ్డుపెట్టుకుని అక్రమంగా ఆస్తులు కూడబెట్టడం, అవినీతికి పాల్పడడం, అక్రమ లావాదేవీలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు లేదా అక్రమ నగదు లావాదేవీలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# నేపాల్ వరదల్లో నల్లగొండ జిల్లాకు చెందిన మహిళ గల్లంతు

- చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన కందిమల్ల సుహాసిని రెడ్డి అదృశ్యం..
- కుటుంబంలో ఆందోళన

నల్లగొండ,/ ఆగస్టు 28 (జనసంఘర్షణ)



నేపాల్‌లో సంభవించిన వరదల నేపథ్యంలో నల్లగొండ జిల్లాకు చెందిన ఓ మహిళ గల్లంతైనట్లు సమాచారం. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన కందిమల్ల సుహాసిని రెడ్డి (42) ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సుహాసిని ఈ నెల 23న విహారయాత్ర కోసం నేపాల్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యుల సమాచారం. అక్కడ వరదల పరిస్థితి తీవ్రంగా ఉండటంతో ఆమెతో సంబంధాలు తెగిపోయి, ఆచూకీ తెలియకుండా పోయినట్లు తెలుస్తోంది.

**గృహప్రవేశం కోసం భారత్‌కు రాక**

సుహాసిని రెడ్డి గత కొన్నేళ్లుగా తన కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాలో నివాసం ఉంటున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లోని ఇంటి గృహప్రవేశ కార్యక్రమం కోసం ఈ నెల 19న భారత్‌కు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం విహారయాత్ర నిమిత్తం నేపాల్‌కు వెళ్లగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. నేపాల్‌లో వరదల పరిస్థితుల నేపథ్యంలో సుహాసిని రెడ్డి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు. ఆమెను సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

# మంత్రి జూపల్లికి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

- రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆత్మీయ శుభాకాంక్షలు

పానగల్/, ఆగస్టు 28/ (జనసంఘర్షణ):



రాఖీ పౌర్ణమి సందర్భంగా పానగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పానగల్ సర్పంచి కూడా పాల్గొని మంత్రికి రాఖీ కట్టారు. రాఖీ పండుగ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**మహిళల సాధికారతకు ప్రభుత్వ ప్రాధాన్యం**

ఆడపడుచుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో స్వావలంబన సాధించేలా ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొంటూ, ప్రతి మహిళ గౌరవంగా, భద్రతతో జీవించే సమాజ నిర్మాణమే రక్షాబంధన్ స్ఫూర్తి అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమం సోదర సోదరీమణుల ఆత్మీయ అనుబంధాన్ని చాటుతూ రాఖీ పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించింది.

# సేవా కార్యక్రమాలతో కోనేరు శశాంక్ జన్మదిన వేడుకలు

- వితంతువులకు, వికలాంగులు కలిపి ఆర్థిక సాయం..
- 500 మంది ఆడపడుచులకు పట్టు చీరలు..
- అనాథ పిల్లలకు మిఠాయిల పంపిణీగ

కోటగిరి, ఆగస్టు 28 (జనసంఘర్షణ):



బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎన్నారై కోనేరు శశాంక్ జన్మదిన వేడుకలను కోటగిరి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలకు వేదికగా మార్చడం ద్వారా ఆయన సేవా దృక్పథాన్ని చాటుకున్నారని పలువురు పేర్కొన్నారు.

**వితంతువులకు ఆర్థిక చేయూత.**

కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 50 మందికి పైగా వితంతువులకు ఆర్థిక సహాయం అందించారు. ఒక్కొక్కరికి సుమారు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు ఆర్థిక సాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.

**500 మంది ఆడపడుచులకు పట్టు చీరలు**

రాఖీ పౌర్ణమి సందర్భంగా కోనేరు శశాంక్ ఆడపడుచుల చేత రాఖీలు కట్టించుకుని ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది మహిళలకు పట్టు చీరలను కానుకగా అందజేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**అనాథ పిల్లలతో ఆత్మీయంగా..**

అనంతరం అనాథాశ్రమాన్ని సందర్శించిన కోనేరు శశాంక్ చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారితో కొంతసేపు గడిపారు. అలాగే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులకు మిఠాయిలు తినిపించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో ఆప్యాయంగా గడిపి వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటం ఆనందంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు నాయకులు, కార్యకర్తలు అన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.



**కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమంలో అంబం సర్పంచ్ కుర్లెపు గంగాధర్, ఉపసర్పంచ్ రేపల్లె సాయిప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సున్నం సాయిలు, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి సాయిరెడ్డి, చందూర్ మాజీ ఎంపీటీసీ నర్సింహులు, బాన్సువాడ రూరల్ అధ్యక్షుడు శ్రీను, కోటగిరి మండల బీజేపీ అధ్యక్షుడు ఏముల నవీన్, రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షుడు హరికృష్ణ, సీనియర్ నాయకులు పుల్లెల మోహన్‌రావు, మహిళా మోర్చా నాయకురాలు శ్యామల కులకర్ణి, మామిడి శ్రీనివాస్, మామిడి రవి, మామిడి సాయిలు, ఓమన్న పటేల్, ప్రకాష్ పటేల్, దావులయ్య, నాగేల్లి శ్రీనివాస్, వడ్ల శ్యామ్, పబ్బా శేఖర్, విలాస్, జగదీష్, శ్యామ్, శివశంకర్, సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ కట్టి సోదర అనుబంధాన్ని చాటుకున్న పోచారం అరుణ





❑ పోచారం రవీందర్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డిలకు రాఖీలు కట్టిన అరుణ

హైదరాబాద్--బాన్సువాడ, /ఆగస్టు 28:/జన సంఘర్షణ)

రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదర అనుబంధానికి ప్రతీకగా పోచారం అరుణ తన సోదరులకు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో డాక్టర్ పోచారం రవీందర్‌రెడ్డికి, బాన్సువాడలోని వారి నివాసంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డిలకు పోచారం అరుణ రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదరుల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయతలకు రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందని పోచారం భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి సోదరి సంతోషంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ సోదరీమణులందరికీ రాఖీ పౌర్ణమి శు భాకాంక్షలు తెలిపారు.

**ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పండుగ**

అన్నా-చెల్లెలు, అక్కా-తమ్ముళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగ రక్షాబంధన్ అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. సోదరుల చేతికి రాఖీ కట్టి.. వారి ఆశీస్సులు తీసుకుంటూ పోచారం అరుణ సోదర అనుబంధాన్ని చాటుకున్న తీరు కుటుంబ సభ్యులు, అభిమానులను ఆకట్టుకుంది.

# తగిలేపల్లి వెంకన్న హత్యపై ఆరు మండలాల కాంగ్రెస్ నేతల గళం

❑ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి..
❑ విష ప్రచారాన్ని సహించేది లేదని ఘాటు హెచ్చరిక

వర్ని,/ ఆగస్టు 28 /(జన సంఘర్షణ):



తగిలేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వెంకన్న హత్య ఘటనపై ఆరు మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వెంకన్న అభిమానులు తీవ్రంగా స్పందించారు. పోతంగల్, కోటగిరి, రుద్రూర్, వర్ని, చందూర్, మోస్రా మండలాలకు చెందిన నాయకులు శు క్రవారం తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వెంకన్న హత్యను నిరసిస్తూ వర్ని చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర నాయకుడు పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ధర్నాకు నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి న్యాయం కోసం గళమెత్తారు.

**ధర్నాను తప్పుదోవ పట్టించే ప్రయత్నం తగదు**

ఈ ధర్నా ఉద్దేశాన్ని పక్కదారి పట్టించేలా కొందరు చేస్తున్న ప్రచారాన్ని ఆరు మండలాల కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబానికి అండగా నిలబడి న్యాయం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా నిర్వహిస్తే దానిని తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. హత్యకు గురైన వెంకన్న కుటుంబాన్ని పరామర్శించకుండా, కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డెక్కిన నాయకులు, కార్యకర్తలపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారి బాధను తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

**ఆరోపణలపై ఆధారాలతో విచారణ జరగాలి**

ఏనుగు రవీందర్‌రెడ్డి, బాజిరెడ్డి వర్గీయులపై నాయకులు చేసిన పలు ఆరోపణలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే ఇలాంటి ఆరోపణలన్నింటిపై సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారానికి బదులు హత్య ఘటనకు సంబంధించిన వాస్తవాలు, దర్యాప్తు పురోగతి ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఎవరు బాధిత కుటుంబం పక్షాన నిలిచారు? ఎవరు న్యాయం కోసం పోరాడుతున్నారు? ఎవరు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారు? అన్నది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

**ప్రజలకు అండగా పోచారం కుటుంబం**

పోచారం కుటుంబం నాలుగు దశాబ్దాలుగా ప్రజలకు అండగా నిలిచిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కష్టాల్లో ఉన్న ప్రజలకు సహాయం చేసిన అనేక సందర్భాలు ఉన్నాయని తెలిపారు. కరోనా సమయంలో తీవ్ర అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న నార్ల రత్నకుమార్‌కు చికిత్స అందించేందుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పోచారం రవీందర్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి చేసిన సహాయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. రాజకీయ భేదాలు పక్కనపెట్టి మానవతా దృక్పథంతో స్పందించడం పోచారం కుటుంబం సేవా తత్వానికి నిదర్శనమన్నారు.

**ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పండి..**

మాజీ సర్పంచ్ వెంకన్న కుటుంబాన్ని పరామర్శించి, వారి బాధను తెలుసుకుని అండగా నిలవాల్సింది పోయి.. న్యాయం కోసం రోడ్డెక్కిన నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడం ఏ న్యాయం? అని నాయకులు ప్రశ్నించారు. బాధిత కుటుంబం కోసం నిలబడటం తప్పా? హత్యను ఖండించడం తప్పా? న్యాయం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా చేయడం తప్పా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నియోజకవర్గంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

**హత్యా రాజకీయాలకు తావులేదు...**

ప్రెస్‌మీట్లకే పరిమితం కాకుండా ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలు చెప్పాలని నాయకులు సూచించారు. వెంకన్న కుటుంబం కన్నీటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? అని ప్రశ్నించారు. బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు అన్ని పరిణామాలను గమనిస్తున్నారని, కాలమే వాస్తవాలకు సమాధానం చెబుతుందని అన్నారు. వెంకన్న కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు. హత్యా రాజకీయాలకు బాన్సువాడ నియోజకవర్గంలో తావులేదు. ప్రజలను తప్పుదోవ పట్టించే విష ప్రచారాన్ని సహించేది లేదు. నిజం వెలుగులోకి రావాలి.. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి అని ఆరు మండలాల కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

# నేరాలపై లోతైన విశ్లేషణతోనే కట్టడి

❑ సాంకేతికతను సమర్థంగా వినియోగించాలి.. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ అవసరం: డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, ఆగస్టు 28 (జన సంఘర్షణ):

నేరాల నివారణ, ఛేదన, దర్యాప్తులో లోతైన డేటా విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులకు సూచించారు. డీజీపీ కార్యాలయంలో అన్ని పోలీసు యూనిట్ల ఉన్నతాధికారులతో నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.
సాంకేతికతతో నేర నియంత్రణ నేర నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. కృత్రిమ మేధ ఆధారిత పోలీసింగ్ అప్లికేషన్లు, సీసీటీఎన్ఎస్, టీజీ-కాప్, హాక్ఐ తదితర డిజిటల్ వేదికల పనితీరు, వినియోగంపై అధికారులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. సీసీటీఎన్ఎస్ డేటా నవీకరణ 96 శాతానికి చేరుకోవడంపై డీజీపీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. నేరాల నివారణ, దర్యాప్తులో సాంకేతికతతో పాటు డేటా విశ్లేషణను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు.

**సైబర్, ఆర్థిక నేరాలపై ప్రత్యేక నిఘా**



సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల కనిపిస్తున్నప్పటికీ మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ ఆదేశించారు. కొత్త నేర చట్టాల అమలు, ఇంటర్‌ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, సైబర్ నేరాల నియంత్రణ, ఈగల్ కార్యకలాపాలు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ పనితీరు, కేసుల భారంపై సమావేశంలో సమీక్షించారు.

**బేసిక్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం**

అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిశితంగా పర్యవేక్షించాలని డీజీపీ స్పష్టం చేశారు. సమర్థమైన ప్రాథమిక పోలీసింగ్, సకాలంలో డేటా విశ్లేషణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నిరంతర పర్యవేక్షణతోనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రతి పోలీసు యూనిట్ తమ పరిధిలోని నేర పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యాలను ఎప్పటికప్పుడు మార్చుకోవాలని సూచించారు. యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. వృత్తిపరమైన ప్రమాణాలను పాటిస్తూ జవాబుదారీతనంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**యువ ఐపీఎస్ అధికారుల ఆవిష్కరణలు**

యువ ఐపీఎస్ అధికారులు పోలీసింగ్‌లో చేపట్టిన నూతన ఆవిష్కరణలు, సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. పోలీసు శాఖ ఆర్థిక, బడ్జెట్ అంశాలు, పోలీసు గృహ నిర్మాణ ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలు, ఇతర కార్యకలాపాలపై కూడా చర్చించారు. లొంగిపోయిన మావోయిస్టులకు సంబంధించిన అంశాలు, వారి పునరావాస చర్యలపైనా సమీక్ష నిర్వహించారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యాతో పాటు రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రక్షాబంధన్.. సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీక

❑ ప్రేమ, బాధ్యత, భద్రత, ఆత్మీయతలకు రాఖీ నిదర్శనం: కాసుల రోహిత్

బాన్సువాడ, ఆగస్టు 28 (జనసంఘర్షణ):




సోదర సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలకు, ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని బాన్సువాడ కో-ఆప్షన్ మెంబర్ కాసుల రోహిత్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను కోరుకోవడం.. సోదరులు తమ సోదరీమణులకు ఎల్లప్పుడూ అండగా నిలిచి రక్షణ కల్పిస్తామని మాట ఇవ్వడం రక్షాబంధన్ పండుగ ప్రత్యేకత అని కాసుల రోహిత్ పేర్కొన్నారు.

**రాఖీ కేవలం దారం కాదు**

రాఖీ అనేది కేవలం ఒక దారం మాత్రమే కాదని.. అది ప్రేమ, బాధ్యత, భద్రత, ఆత్మీయతలకు ప్రతీక అని అన్నారు. కుటుంబ విలువలు, మానవ సంబంధాల గొప్పతనాన్ని గుర్తుచేసే పండుగల్లో రక్షాబంధన్ ఒకటని తెలిపారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో కుటుంబ బంధాలను కాపాడుకుంటూ పరస్పరం ప్రేమాభిమానాలతో జీవించడం ఎంతో అవసరమన్నారు. మహిళలకు సమాజంలో గౌరవం, భద్రత, సమాన అవకాశాలు కల్పించడమే రక్షాబంధన్ స్ఫూర్తిని నిజంగా ఆచరించినట్లవుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి నెలకొని.. సోదర సోదరీమణుల అనుబంధం చిరస్థాయిగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ బాన్సువాడ పట్టణ ప్రజలందరికీ మరోసారి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## కోటగిరిలో ఘనంగా ఎన్నారై కోనేరు శశాంక్ జన్మదిన వేడుకలు

❑ సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచిన కోనేరు చారిటబుల్ ట్రస్ట్..
❑ అన్నదానం, ఆర్థిక సాయం, చీరల పంపిణీ

కోటగిరి--పోతంగల్, ఆగస్టు 28 (జన సంఘర్షణ,/:




ఎన్నారై కోనేరు శశాంక్ జన్మదిన వేడుకలను కోటగిరి మండల కేంద్రంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ట్రస్ట్ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శశాంక్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. వేడుకలను సంబరాలకే పరిమితం చేయకుండా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

**ఘనంగా అన్నదాన కార్యక్రమం**

కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కోటగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కోనేరు శశాంక్ సందర్శించి విద్యార్థినులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

**మహిళలకు చీరలు.. బాధితులకు ఆర్థిక సాయం**

రాఖీ కట్టిన మహిళలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి చెక్కుల రూపంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పోతంగల్, కోటగిరి ప్రెస్‌క్లబ్ సభ్యులు కోనేరు శశాంక్‌ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రముఖులు, నాయకులు సైతం ఆయనను సన్మానించారు.

**దేవునిగుట్ట తండాలో కేక్ కట్"**

అనంతరం రుద్రూర్ మండలం దేవునిగుట్ట తండాలో కార్యకర్తలు, ట్రస్ట్ సభ్యుల సమక్షంలో కోనేరు శశాంక్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబం సర్పంచ్ కుర్లెపు గంగాధర్, ఉపసర్పంచ్ రేపల్లె సాయిప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సున్నం సాయిలు, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి సాయిరెడ్డి, చందూర్ మాజీ ఎంపీటీసీ నర్సింహులు, బాన్సువాడ రూరల్ అధ్యక్షుడు శ్రీను, కోటగిరి మండల బీజేపీ అధ్యక్షుడు ఏముల నవీన్, రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షుడు హరికృష్ణ, సీనియర్ నాయకులు పుల్లెల మోహన్‌రావు, మహిళా మోర్చా నాయకురాలు శ్యామల కులకర్ణి, మామిడి శ్రీనివాస్, మామిడి రవి, మామిడి సాయిలు, ఓమన్న పటేల్, ప్రకాష్ పటేల్, దావులయ్య, నాగేల్లి శ్రీనివాస్, వడ్ల శ్యామ్, పబ్బా శేఖర్, విలాస్, జగదీష్, శ్యామ్, శివశంకర్, సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

శనివారం
29 ఆగస్టు 2026

# నేపాల్ వరదల్లో 178 మంది భారతీయులు గల్లంతు

- భోటేకోశీ, త్రిశూలి నదుల ఉగ్రరూపం.. వందలాది మంది పర్యాటకులు, ప్రయాణికుల ఆచూకీ గల్లంతు





హైదరాబాద్,/ ఆగస్టు 28/జన సంఘర్షణ): నేపాల్‌లో భోటేకోశీ, త్రిశూలి నదులకు వచ్చిన ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వరదల ప్రభావిత ప్రాంతాల్లో భారీ సంఖ్యలో పర్యాటకులు, ప్రయాణికులు గల్లంతైనట్లు నేపాల్ టూరిజం బోర్డు ప్రాథమికంగా వెల్లడించింది. రసువా, నువాకోట్, ధాదింగ్, గోర్ఖా ప్రాంతాల్లో వరదల ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు పేర్కొంది. మొత్తం 644 మంది పర్యాటకులు, ప్రయాణికులు గల్లంతైనట్లు ప్రాథమికంగా గుర్తించగా.. వారిలో 127 మంది నేపాల్ పౌరులు, 517 మంది విదేశీయులు ఉన్నట్లు తెలిపింది.

### గల్లంతైన విదేశీయుల్లో 178 మంది భారతీయులు

గల్లంతైన విదేశీయుల్లో 178 మంది భారతీయులు ఉన్నట్లు నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది. ఆస్ట్రేలియాకు చెందిన 35 మంది, ఉక్రెయిన్‌కు చెందిన 53 మంది, అమెరికాకు చెందిన 65 మంది, మలేషియాకు చెందిన 51 మంది, కెనడాకు చెందిన 25 మంది, యూకేకు చెందిన 33 మంది ఉన్నట్లు పేర్కొంది. ట్రెక్కింగ్, ట్రావెల్ సంస్థల నుంచి అందిన వివరాలను స్థానిక...అధికారులు, భద్రతా సిబ్బంది, గైడ్ల సహకారంతో ధ్రువీకరిస్తున్నట్లు టూరిజం బోర్డు తెలిపింది. వరదల్లో చిక్కుకున్న, గాయపడిన వారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది.

### భారతీయులపై కేంద్రం ప్రత్యేక దృష్టి


మరోవైపు నేపాల్ వరదలపై భారత విదేశాంగ శాఖ కూడా స్పందించింది. 288 మంది భారతీయులు గల్లంతైనట్లు పేర్కొంది. వీరిలో 73 మంది త్రిశూలి ప్రాజెక్టు సిబ్బంది, 86 మంది తమిళనాడు యాత్రికులు, 33 మంది కేరళకు చెందినవారు, 32 మంది పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు ఉన్నట్లు తెలిపింది. గల్లంతైన వారిలో ఈషా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది ఉన్నట్లు వెల్లడించింది. ఇప్పటివరకు 21 మంది భారతీయులను రక్షించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. మానస సరోవర్ ప్రాంతంలో మరో 200 మంది భారతీయులు చిక్కుకున్నట్లు పేర్కొంది. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు, టూర్ ఆపరేటర్లతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించింది.

### 47.5 టన్నుల సహాయ సామగ్రి

వరద బాధిత నేపాల్‌కు భారత్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని విదేశాంగ శాఖ తెలిపింది. ఇప్పటికే 47.5 టన్నుల సహాయ సామగ్రిని పంపినట్లు పేర్కొంది. అవసరమైన ప్రాంతాలకు తాత్కాలిక వంతెనలు కూడా పంపించనున్నట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, నేపాల్ టూరిజం బోర్డు అత్యవసర సహాయం కోసం టోల్‌ఫ్రీ 1234, హెల్ప్‌లైన్ 1144, టూరిస్ట్ పోలీస్ 9851289445 నంబర్లను ప్రకటించింది. భోటేకోశీ, త్రిశూలి నదుల ఉగ్రరూపంతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతుండగా.. గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

# ఉపాధ్యాయురాలిపై బ్లేడుతో దాడి

- ఆర్థిక లావాదేవీల వివాదమే కారణమా?..
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



గుంతకల్లు, ఆగస్టు 28 (జనసంఘర్షణ): అనంతపురం జిల్లా గుంతకల్లులో ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలిపై బ్లేడుతో దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. హోమియో వైద్యుడిగా పనిచేస్తున్న వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రైల్వే క్వార్టర్స్‌లో నివసించే రైల్వే ఉద్యోగి కృష్ణారెడ్డి భార్య అరుణ (35) రాజేంద్రనగర్‌లోని చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆరోగ్య సమస్యలతో హోమియోపతి వైద్యుడు శ్రీనివాస్ వద్ద చికిత్స తీసుకున్న ఆమెకు ఆయనతో పరిచయం ఏర్పడినట్లు సమాచారం.

### ఆర్థిక వివాదాలతో గొడవలు

కొంతకాలంగా ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వివాదాలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో శ్రీనివాస్ అసభ్యంగా ప్రవర్తించడంతో అరుణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు అతడిని హెచ్చరించి వదిలినట్లు సమాచారం. దీంతో కక్ష పెంచుకున్న శ్రీనివాస్ గురువారం మధ్యాహ్నం పాఠశాల వద్ద అరుణపై దాడికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. భోజనం ముగించుకుని పాఠశాలలోకి వెళ్తున్న సమయంలో బ్లేడుతో ఆమె గొంతుపై దాడి చేసినట్లు తెలిపారు.

### తీవ్ర గాయాలు.. ప్రాణాపాయం తప్పింది

దాడిలో అరుణకు తీవ్ర గాయాలై రక్తస్రావం జరిగినప్పటికీ, ఆమె అక్కడి నుంచి తప్పించుకుని పరుగెత్తినట్లు సమాచారం. స్థానికులు గమనించి వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ వంశీకృష్ణ నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### అధికారుల హెచ్చరిక

వ్యక్తిగత వివాదాలను హింసాత్మకంగా పరిష్కరించుకోవడం చట్టవిరుద్ధమని పోలీసులు హెచ్చరించారు. ఎవరైనా బెదిరింపులు, వేధింపులు లేదా దాడులకు పాల్పడితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# రూ.22 వేల కోట్ల క్లెయిమ్స్.. రూ.6.5 కోట్ల సెటిల్‌మెంట్‌కు ఆమోదం!

- సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా కేసులో ఎన్‌సీఎల్‌టీ కీలక నిర్ణయం.
- రుణదాతలకు భారీ హెయిర్‌కట్




న్యూఢిల్లీ, ఆగస్టు 28 (జనసంఘర్షణ): మీడియా రంగ ప్రముఖుడు, జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ.22,006.57 కోట్ల మేర ఆమోదించిన రుణదాతల క్లెయిమ్స్‌కు కేవలం రూ.6.5 కోట్ల రీపేమెంట్ ప్లాన్‌కు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే రుణదాతలకు క్లెయిమ్ చేసిన మొత్తంతో పోలిస్తే దాదాపు 99.97 శాతం మేర హెయిర్‌కట్ తప్పనిసరి కానుంది. అంటే భారీ మొత్తంలో బకాయిలు ఉన్నప్పటికీ రుణదాతలకు తిరిగి లభించే మొత్తం చాలా స్వల్పంగా ఉండనుంది. రూ.6.25 కోట్లు రుణదాతలకు సుభాష్ చంద్ర ప్రతిపాదించిన పరిష్కార ప్రణాళిక ప్రకారం రుణదాతలకు రూ.6.25 కోట్లు, దివాలా పరిష్కార ప్రక్రియకు సంబంధించిన ఖర్చుల కోసం మరో రూ.25 లక్షలు కేటాయించారు. అయితే ఈ ప్రతిపాదనపై రుణదాతలలో ఏకాభిప్రాయం లేకపోయింది. మెజార్టీ రుణదాతలు ప్లాన్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ, కొందరు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

### ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌కు భారీ నష్టం

ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నేతృత్వంలోని రుణదాతలు తక్కువ రికవరీని అంగీకరించడం సరికాదని వాదించారు. ఆ సంస్థకు ఆమోదించిన క్లెయిమ్ మొత్తం రూ.1,322.39 కోట్లు కాగా, ప్రతిపాదిత ప్లాన్ ప్రకారం కేవలం రూ.38.09 లక్షలు మాత్రమే అందనున్నట్లు సమాచారం. ఇది క్లెయిమ్‌లో అత్యంత స్వల్ప భాగం.

### భిన్నాభిప్రాయాల అనంతరం మెజార్టీ నిర్ణయం

ఈ కేసులో తొలుత ఎన్‌సీఎల్‌టీ డివిజన్ బెంచ్‌లోని ఇద్దరు సభ్యులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో మూడో సభ్యుడిని నియమించారు. ఎన్‌సీఎల్‌టీ జుడీషియల్ సభ్యుడు నీలేశ్ శర్మ మూడో సభ్యుడిగా వ్యవహరించి మెజార్టీ అభిప్రాయానికి అనుగుణంగా రీపేమెంట్ ప్లాన్‌కు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. ప్లాన్‌కు 80.81 శాతం ఓటింగ్ వాటా మద్దతు లభించగా, వ్యతిరేకించిన రుణదాతల ఓటింగ్ వాటా 20 శాతం కంటే తక్కువగా ఉన్నట్లు ట్రైబ్యునల్ పేర్కొంది.

### తిరస్కరిస్తే రికవరీ మరింత కష్టమయ్యే అవకాశం?

సుభాష్ చంద్ర వ్యక్తిగత ఆస్తుల విలువతో పోలిస్తే ప్రతిపాదించిన రీపేమెంట్ మొత్తం కూడా ఎక్కువగా లేదని ట్రైబ్యునల్ అభిప్రాయపడినట్లు సమాచారం. ప్రస్తుత పరిష్కార ప్రణాళికను తిరస్కరిస్తే ఆయన పూర్తి స్థాయి దివాలా ప్రక్రియలోకి వెళ్లే అవకాశం ఉందని, ఆ పరిస్థితిలో రుణదాతలకు ప్రస్తుత ప్రతిపాదన కంటే మెరుగైన రికవరీ లభించే అవకాశాలు తక్కువగా ఉండవచ్చని ఎన్‌సీఎల్‌టీ పేర్కొంది. రుణగ్రహీత ఆర్థికంగా తిరిగి నిలదొక్కుకుంటే భవిష్యత్తులో రుణదాతలకు రికవరీ అవకాశాలు మెరుగుపడవచ్చన్న అంశాన్ని కూడా ట్రైబ్యునల్ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం.

### బ్యాంకింగ్ రంగానికి మరోసారి హెచ్చరిక

భారీ మొత్తంలో రుణాలు ఇచ్చే సమయంలో రుణగ్రహీత ఆర్థిక సామర్థ్యం, ఆస్తుల విలువ, తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని సమగ్రంగా అంచనా వేయాల్సిన అవసరాన్ని ఈ వ్యవహారం మరోసారి చర్చకు తెచ్చింది. క్లెయిమ్ చేసిన వేల కోట్లతో పోలిస్తే అతి స్వల్ప మొత్తంతో పరిష్కారం కావడం.. రుణదాతలకు భారీ హెయిర్‌కట్ ఎలా ఎదురవుతుందో చూపించే ఉదాహరణగా నిలిచింది.

# పోలీసుల అదుపులో ముగ్గురు బంగ్లాదేశీయులు

- పుణెలో సైనిక నిఘా వర్గాలతో కలిసి పోలీసుల తనిఖీలు..
- సరైన పత్రాలు లేకుండా నివాసం ఉంటున్నట్లు గుర్తింపు

మహారాష్ట్ర, ఆగస్టు 28 (జనసంఘర్షణ):




మహారాష్ట్రలోని పుణె నగరంలో సరైన పత్రాలు లేకుండా నివాసం ఉంటున్నారనే ఆరోపణలతో ముగ్గురు బంగ్లాదేశీయులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పుణె నగర పోలీసుల ప్రత్యేక విభాగం, సైనిక నిఘా విభాగం సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో వీరిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

### నిఘా సమాచారంతో తనిఖీలు

సైనిక నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు ఆగస్టు 27న ప్రత్యేక పోలీసు బృందం పుణెలోని అనుమానిత ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా సోనియా అక్తర్, మోటియర్ గాజీ, సోనియా మోటి పాన్ అనే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రాథమిక విచారణలో వీరు చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా భారత్‌లో నివసిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వారి పౌరసత్వం, భారత్‌లో నివాసానికి సంబంధించిన పత్రాలపై అధికారులు మరింత విచారణ చేపట్టారు.

### స్వదేశానికి పంపించే ప్రక్రియ

ప్రస్తుతం ముగ్గురిపై నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. తదుపరి చట్టపరమైన చర్యలు పూర్తయ్యే వరకు వారు పోలీసుల అదుపులోనే ఉంటారని, నిబంధనల ప్రకారం స్వదేశానికి పంపించే ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పుణె నగరంలో సరైన పత్రాలు లేకుండా నివసిస్తున్న విదేశీయులను గుర్తించేందుకు నిఘా, భద్రతా సంస్థలు పర్యవేక్షణను మరింత ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.


### అధిక శబ్ద పరికరాలపై నిషేధం


ఇదిలా ఉండగా పండుగల నేపథ్యంలో అధిక శబ్దం చేసే ప్లాస్మా సౌండ్ సిస్టమ్స్, ప్రెజర్ మైక్‌ల వినియోగంపై పుణె పోలీసులు నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిషేధిత పరికరాలను స్వాధీనం చేసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. చట్టబద్ధమైన పత్రాలు లేకుండా నివాసం ఉంటున్న వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.

# ఉద్యోగం వస్తుందన్న ఆనందం.. అంతలోనే ఆవిరి

- ఇంటర్వ్యూ బాగా జరిగిందంటూ భర్తకు ఫోన్.. ఆ తర్వాత విషాదం

పటమట (విజయవాడ తూర్పు)/, ఆగస్టు 28/ (జనసంఘర్షణ):





ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలన్న ఆశతో ఇంటర్వ్యూకు వెళ్లిన ఓ యువతి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. బీటెక్ చదివిన సూరవరపు షకీనా (24) సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం కోసం సోమవారం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంటర్వ్యూ బాగా జరిగిందని, ఉద్యోగం తప్పకుండా వస్తుందని మంగళవారం రాత్రి భర్తకు ఫోన్ చేసి సంతోషంగా చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉద్యోగం వస్తే తన జీవిత లక్ష్యాన్ని చేరుకున్నట్లేనని షకీనా ఆనందంగా చెప్పిన కొద్దిసేపటికే విషాదం చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

### ఏడాది క్రితమే వివాహం

భీమవరానికి చెందిన షకీనాకు రాజమండ్రికి చెందిన సాయికృష్ణతో గత ఏడాది వివాహం జరిగింది. సాయికృష్ణ విజయవాడ గురునానక్ కాలనీలోని ఓ ప్రైవేటు కన్సల్టెన్సీలో ఆర్కిటెక్ట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివాహమైన రెండు నెలల తర్వాత ఈ దంపతులు విజయవాడ పటమట ఆర్‌ఆర్ గార్డెన్స్‌లోని కనకదుర్గ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. రోజూ స్థానికులతో కలుపుగోలుగా, ఆత్మీయంగా ఉండే షకీనా మృతి చెందడంతో స్థానికులు సైతం తీవ్ర దిగ్భ్రాంతికి గురై కంటతడి పెట్టారు. ఉద్యోగం సాధించి జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలనుకున్న యువతి.. అంతలోనే విషాదానికి గురికావడం కుటుంబ సభ్యులను, స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

# బంగారు తిరుచ్చిపై పద్మావతి దేవి విహారం



తిరుచానూరు, ఆగస్టు 28 (జనసంఘర్షణ): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి పై నాలుగు మాడా వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఇందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి, నిత్య కైంకర్యాలు, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉద్యానవనంలో అమ్మవారి ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఉంజల్ సేవ నిర్వహించారు. అనంతరం విశేషాలంకరణలో విరాజిల్లుతున్న అమ్మవారు తిరుచ్చి పై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శనివారం
29 ఆగస్టు 2026

# ఆర్మూర్‌లో పీవీఆర్ హోటల్‌పై ఆరోపణలు





- వ్యభిచారం, పేకాటకు అడ్డాగా మారిందంటూ విమర్శలు..
- పోలీసుల తీరుపై ప్రశ్నలు

**ఆర్మూర్,/ ఆగస్టు 28 / (జనసంఘర్షణ):** ఆర్మూర్ పట్టణంలోని పీవీఆర్ హోటల్‌లో వ్యభిచారం జరుగుతోందంటూ వచ్చిన ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ రాయి సింగ్ పట్టుబడ్డారంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పోలీసులు, హోటల్ యాజమాన్యం నుంచి అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

పీవీఆర్ హోటల్ కొంతకాలంగా పేకాట, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజకీయ అండదండలు ఉన్నాయనే ప్రచారం నేపథ్యంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**రాజకీయ అండ ఉందా?**

కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి అండతో కొందరు నాయకులు రెచ్చిపోతున్నారంటూ ప్రత్యర్థి వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు ఆధారాలు, అధికారిక ధ్రువీకరణ లేకుండా ఎవరి పాత్రనూ నిర్ధారించలేం. పోలీసులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులకు ప్రజల విజ్ఞప్తి

హోటళ్లు, లాడ్జీల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తే వాటిపై నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్మూర్ పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసి, ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు

- వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది
- కలెక్టర్ సుమిత్ కుమార్
- ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్







**చిత్తూరు,ఆగస్ట్ 28 (జనసంఘర్షణ):** సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి వైకల్యం అడ్డు కాదని పట్టుదలతో కృషిచేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో 59 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో విభిన్న ప్రతిభావంతులు ఎవరికి తక్కువ కాదని వీరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని వీటిని సద్వినియోగంచేసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తిలో ఒక ప్రత్యేకత నైపుణ్యం ఉంటుందని విభిన్న ప్రతిభావంతుల్లో ఎంతోమంది నైపుణ్యం గల వారు ఉన్నారని వీరిని ఆదర్శంగా తీసుకొని పట్టుదలతో లక్ష్యాలను సాధించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిల్లు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్ వంటి పరికరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నెలకు రూ.6 వేల పింఛన్ అందిస్తున్న ప్రభుత్వం, వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా కొత్త పథకాన్ని ప్రకటించింది. జిల్లాలోని దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు 59 మంది దివ్యాంగులకు ఒక్కొక్కటి సుమారు రూ.1.20 లక్షల విలువైన 59 ద్విచక్ర వాహనాలను పంపిణీ చేయడం జరిగింది. పూర్తిగా పారదర్శకమైన విధానంలో ఆన్‌లైన్‌ద్వారాదరఖాస్తులను స్వీకరించి, దివ్యాంగుల సర్టిఫికెట్లతో పాటు సదరం సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం అర్హులను ఎంపిక చేసి ఈ పంపిణీ కార్యక్రమాన్నినిర్వహించాం.అదేవిధంగా సుమారు మూడు నెలల క్రితం జిల్లాలో ఏ ఎల్ ఐ ఎం సి ఓ క్యాంపును నిర్వహించగా, దాదాపు 5,300 మంది దివ్యాంగులను గుర్తించడం జరిగింది. వారికి సుమారు రూ.6 కోట్ల విలువైన వివిధ రకాల సహాయపరికరాలను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని సెప్టెంబర్ మొదటి వారంలో నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. జిల్లాలో వివిధ సబ్సిడీ కార్యక్రమాల ద్వారా దివ్యాంగులకు సుమారు రూ.15 కోట్ల విలువైనపరికరాలు, స్కూటీలు, ట్రైసైకిళ్లు, సైకిళ్ల తదితరాలను అందించడం జరిగింది. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలనుకొనసాగిస్తూజిల్లాలోని ప్రతిదివ్యాంగుడికి అవసరమైన సహాయం అందేలా శాచ్యురేషన్ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. చిత్తూరు ఎం ఎల్ఏ గురజాల జగన్మోమాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉందనడానికి ఈరోజు నిర్వహించిన వాహనాల పంపిణీ కార్యక్రమం ఒక నిదర్శనం. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వం మరియు దివ్యాంగుల మధ్య ఉన్న ఆత్మీయ బంధాన్ని చాటుతూ సుమారు 60 మంది దివ్యాంగులకు స్కూటర్లు, ట్రైసైకిళ్లు అందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. చిత్తూరు నియోజకవర్గంలోని తెలుగు మహిళలకు, కూటమి ప్రభుత్వంలోని మహిళా నాయకురాళ్లందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. దివ్యాంగులకు ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందనడానికి ఇప్పటివరకు చేపట్టిన అనేక కార్యక్రమాలు నిదర్శనం.ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పీవీకేఎన్ గ్రౌండ్స్‌లో సుమారు 4,000 మంది దివ్యాంగులకు వారికి అవసరమైన వివిధ రకాల సహాయ పరికరాలను అందించడం జరిగింది. చెవిటి వారికి వినికిడి పరికరాలు, కాళ్లు లేనివారికి కృత్రిమ కాళ్లు, నడకకు అవసరమైన స్టిక్స్, ఇతర సహాయక పరికరాలను వారి అవసరాలను పరిశీలించి అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచిదివ్యాంగులసంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది.

## ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చొరవతో పెద్ద కుంటపల్లి ఆలయ అభివృద్ధికి 2..50 కోట్లు టీటీడీ నిధులు

- ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం పెద్దగుంటపల్లి గ్రామస్తులు



**గంగాధర్ నెల్లూరు (జనసంఘర్షణ):** గంగాధర నెల్లూరు మండలం పెద్దకుంటపల్లి గ్రామంలోని శ్రీ కనుగొండరాయ స్వామి ఆలయంలో మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు టీటీడీ సాధారణ నిధుల నుంచి రూ.2.50 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఇప్పటికే కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) ద్వారా చేపట్టిన పనులు నిధుల కొరతతో పూర్తికాకపోవడంతో, ఆలయ ఇంజినీరింగ్ విభాగం గుర్తించిన ముఖమండపం స్తంభాలు, కట్‌స్టోన్ ఫ్లోరింగ్, ధ్వజస్తంభం, బలిపీఠం, ప్రహరీ, పాకశాల, యాగశాల తదితర పనులను ఈ నిధులతో చేపట్టనున్నారు. ఎమ్మెల్యే థామస్ చేసిన ప్రత్యేక అభ్యర్థన మేరకు టీటీడీ బోర్డు ఈ నిధుల్ని మంజూరు చేయాలని నిర్ణయించింది. శుక్రవారం రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ అనుమతి ఇచ్చింది. ఈ పనులను ఈ-టెండర్ల ద్వారా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది... టిటిడి 2.50కోట్లు నిధులు రావడానికి కృషిచేసిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పెద్ద గుంటపల్లి గ్రామస్తులు తెలిపారు.

## బోయకొండ గంగమ్మను దర్శించుకున్న మాజీ చైర్మన్ ఎస్ కె ఆర్



**చౌడేపల్లి ఆగస్టు 28 (జనసంఘర్షణ):** బోయకొండ మాజీ చైర్మన్ ఎస్కె వెంకటరమణారెడ్డి శుక్రవారం బోయకొండ గంగమ్మ ను దర్శించుకున్నారు.రాహుకాల సమయంలో లోకమాత గంగమ్మను ఆయన దర్శించుకున్నారు. అనంతరం మండపంలో వేద ఆశీర్వాదం తీసుకున్నారు బోయకొండ గంగమ్మ ఆలయం మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని అమ్మవారి సేవకు కృత నిశ్చయంతో ఉన్నారని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

## వెల్లువెత్తిన "రాఖీ" బంధం..

- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కు రాఖీలు కట్టిన అక్కచెల్లెలు.

**చిత్తూరు ఆగస్టు 28 (జనసంఘర్షణ):**



రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజా దర్బార్ అక్కచెల్లెమ్మలతో కిక్కిరిసింది. వెల్లువెత్తిన ఆత్మీయతతో మహిళలు, తెలుగు దేశం పార్టీ, కూటమి పార్టీల మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కి రాఖీలు కట్టారు. అక్క చెల్లెమ్మలు కట్టిన రాఖీలతో ఎమ్మెల్యే గారి రెండుచేతులునిండిపోయాయి. ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టిన అక్క చెల్లెమ్మలకు.. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, సతీమణి కంచెర్ల ప్రతిమ పసుపు,కుంకుమ,చీర, మిఠాయిలు అందించారు. చెల్లెమ్మలనుఆశీర్వదించారు ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## చిత్తూరు డీఐ రోడ్డులో వినాయక మండపానికి పూజ చేసిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు ఆగస్టు 28 (జనసంఘర్షణ):** వినాయక చవితి పర్వదినం సందర్భంగా విఘ్నాలన్ని తొలగి ప్రజలందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గణపతిని ప్రార్థించారు. చిత్తూరు డీఐ రోడ్డులో ఏర్పాటు చేసే గణపతి విగ్రహానికి సంబంధించి మండపం నిర్మాణాన్ని శుక్రవారం ఉదయం పూజ చేసి ప్రారంభించారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co